

## మమతలని మేల్కొలిపే కథ

# ఋణం

ఉపద్రష్ట కృష్ణప్రియ

**లంచ్ టైంలో టిఫిన్ తింటూండగా సెల్ మ్రోగింది. తీసాను. హైదరాబాదు నుంచి "హలో" ఆదుర్దా అణుచుకుంటూ అన్నాను.**

"ఎవరదీ మాట్లాడేదీ..? శంకరం?"

"ఆ..నేనే..ఎవరూ?" సందిగ్ధంగా అన్నా.

"వెధవకానా, నేనేరా..పెద్దన్నయ్యని..నరసింహాన్ని"

తింటున్న ఇడ్లీముక్క గబుక్కున మింగి "ఏంటన్నయ్యా, బాగున్నావా?" అన్నాను.

"ఆ..అదే బాగు. ఓసారి వెళ్ళిపోచ్చీరాదూ..చూడాలనివుంది" అని అంటూండగా ఫోన్ కట్ అయింది. వెంటనే ఆ నంబర్‌కి ట్రై చేసాను. ఎంగేజ్డ్ సౌండు వస్తోంది. 'బహుశః బయటకి వచ్చి చేశాడేమో... చేతిలో డబ్బులున్నాయో లేదో' అనుకున్నాను. అన్నయ్య గొంతులో దైన్యం, అభ్యర్ధన నన్ను స్థిమితంగా ఉండనియ్యలేదు. బాక్స్ మూసేసి చెయ్యి కడిగేసుకుని లీవ్ పెట్టి ఇంటికి వెళ్ళాను.

వేళకాని వేళ ఇంటికి వచ్చిన నన్ను చూసి గాబరాగా "ఏమైంది?" అంది వసంత.

"హైదరాబాదు వెడుతున్నాను. కాస్త కందిగుండా, పచ్చళ్ళూ ఇవ్వు" అన్నాను.

"ఎందుకూ?"

"అన్నయ్యని చూద్దామని..ఎందుకోగానీ రమ్మని ఫోన్ చేసాడు"

ముఖం కడుక్కుంటూండగా కాఫీ తెచ్చింది వసంత. సోఫాలో కూర్చుని కాఫీ ఫ్రెష్‌నెస్‌ని ఆస్వాదిస్తూండగా-

"చూడండి. ఎవరి సమస్యలు వారివి. గొప్పకోసం పోయి, అక్కరలేని బాధ్యతలు తలకెత్తుకోకండి" అని వసంత అంటూంటే నా దవడ కండరం బిగుసుకుంది గట్టిగా.

బేగ్ సర్దుకుని బయటకి నడుస్తూ "రెండురోజుల్లో వచ్చేస్తాను. జాగ్రత్త" అన్నాను. బజార్లోకెళ్ళి ఇంకొన్ని కొనుక్కుని, కాంప్లెక్స్ చేరేప్పటికి బస్ రడీగా వుంది. టికెట్ తీసుకుని రిలాక్స్‌డ్‌గా కూర్చోగానే అన్నయ్యని గూర్చిన ఆలోచనలు కందిరీతల తుట్టలాగ ముసురుకోసాగాయి.

మా అన్నయ్యకీ నాకూ మధ్య పదిహేనేళ్ళ వ్యత్యాసం వుంది. మా తాతగారికి నలుగురూ ఆడపిల్లలే అవడంవల్ల, మా తాతగారు మా అన్నయ్యని ఆయన చిన్నతనంలోనే తీసుకెళ్ళి పెంచుకున్నారుట. అందుకని మా పెద్దన్నయ్య ఎప్పుడూ తాతగారి ఊరులోనే ఉండేవాడు. అది ఒక పల్లెటూరు. తాతగారొక ఏభై ఎకరాలకి ఆసామి. ఆయనకి డెభ్భై ఏళ్ళు పైబడడంతో, పొలం పనులు చూసుకోవడం కష్టమవడంతోటి, డిగ్రీ కాగానే వ్యవసాయంలోకి దిగక తప్పలేదుట అన్నయ్యకి. ప్రతిసారీ నాట్లకీ, కోతలకీ, నూర్పుళ్ళకీ, సాయంగా వుంటుందని, అమ్మని అమ్మమ్మ రమ్మనేది.

నేను నాలుగో క్లాసులోకి వచ్చిన దగ్గర్నించీ నాకు అన్నీ గుర్తున్నాయి. మా పెద్దక్క డిగ్రీ చేస్తుండేది. చిన్నక్క ఇంటర్, చిన్నన్నయ్య టెన్త్. నాన్నగార్కి ఇబ్బందిలేకుండా ఇల్లు సద్దుకునేది పెద్దక్క. చిన్నపిల్లాడినైనా నన్ను వెంటేసుకుని వెళ్ళేది మా అమ్మ. మా పెద్దన్నయ్య నన్ను కాలుకింద పెట్టనియ్యకుండా, చాలా ప్రేమగా చూసుకునేవాడు. అన్నయ్యతో గడపడం నాకెంతో ఆనందంగా వుండేది. ఆ వూళ్ళోని పంట కాలువలూ, పొలాలూ, బెల్లంబట్టీ, గానుగా ఎంతో అద్భుత దృశ్యాలుగా నా మనోఫలకం మీద ముద్రవేసుకున్నాయి. పొలం ఇంటికి రెండుమైళ్ళ దూరంలో వుండేది. సాధారణంగా ఎడ్లబండిమీద వెళ్ళేవాళ్ళం. ఒక్కోసారి నడిచి కూడా వెళ్ళేవాళ్ళం. నేను నడవలేక రొప్పుతూ వుంటే, భుజాల మీదకి ఎక్కించుకుని తీసికెళ్ళేవాడు అన్నయ్య. దారిలో ఈతపళ్ళూ, కంజా పెట్టేవాడు. అవి చాలా బాగుండేవి.

పొలంలో కళ్ళాం దగ్గర ఓ పాక వుండేది. దానిలో ఓ నులకమంచమూ, ఓ బొంతా, ఓ తలగడా, ఓ దుక్కదుప్పటీ ఉండేవి. పక్కనే ఓ చిన్నబల్ల వుండేది. దానిమీద ఉప్పూ వర్రా, కందిసున్నీ, నూనె సీసాల్లో వుండేవి. ఒక బోర్నవిటా డబ్బాలో అటుకులుండేవి. ఓ కుండలో నీళ్ళూ, దానిమీద మట్టిమూకుడూ, ఓ జెర్మన్ సిల్వర్ గ్లాసూ ఉండేది. ప్రతి సాయంకాలమూ మా అన్నయ్య నాకు పెట్టే ఉపహారాలు ఎంతో రుచిగా వుండేవి. ఒక రోజు అటుకులూ కందిసున్నీ నూనె కలిపి పెట్టేవాడు. ఇంకోరోజు పొలంగట్లమీద కాసిన దోసకాయలు ముక్కలు చేసి ఉప్పూ వర్రా అద్ది పెట్టేవాడు. ఇంకోరోజు ఎర్రదుంపల్నీ, తేగల్నీ మా కంబారి చేత దుముకులో పెట్టించి చక్కగా కాలేక తీసి ఇచ్చేవాడు.

మధ్యాహ్నాం అన్నంలోకి మా అమ్మ ఎన్ని ఆధరువులు పంపినా, గట్లమీదుండే వంగచెట్లనుంచి రెండుకాయలు తెచ్చి దుముకులో పెట్టి, కాలేక తొక్కతీసి రెండు పచ్చిమిరప కాయలతో పిసికి ఉప్పుకలిపి చేసే పచ్చడి అమోఘంగా వుండేది. పొలంగట్లంట కాసే బుడంకాయలు ఏరి అమ్మకిస్తే, నాలుగు పక్షాలుగా చేసి, ఉప్పూ వామూ కూరి ఊర పెట్టేది. వాటిని చల్దన్నంలో అద్దుకు తింటూంటే ఎంతో రుచిగా వుండేది.

ఊరి మొదట్లో ఒక పెద్ద బెల్లం బట్టీ వుండేది. చెరకు సీజన్‌లో ఎప్పుడూ పెద్ద పెద్ద కళాయిల్లో చెరకు పానకం మరుగుతూ వుండేది. మేము పొలానికి వెళ్ళేప్పుడు దబ్బనంతో ఎర్రదుంపలకీ, కొబ్బరి కురిడీలకీ పురికొసలు గుచ్చి బట్టీ ఆసామి వీరాసామికిచ్చేవాడు అన్నయ్య. వాటిని పైనున్న పందిరికి వేలాడదీసి, ఉడుకుతున్న పానకంలోకి దించి, సాయంత్రం దాకా ఉడకబెట్టి ఇచ్చేవాడు వీరాసామి. అవి తింటూంటే స్వర్గానికి ఒక మెట్టు ఎక్కువగా ఉన్నట్లనిపించేది. ఎప్పుడైనా బెల్లం పాకం గట్టిపడుతుండే వేళకి వెడితే, మా అన్నయ్య భుజమ్మీది టవల్‌లో కర్రతెడ్డుతో నాలుగు మార్లు పోసేవాడు వీరాసామి. ఇల్లు చేరేటప్పటికి, తిరపతిలో కళ్యాణం చేయించుకుంటే ఇచ్చేంత లడ్డూ కైవారంలో తయారయ్యేది బెల్లందిమ్మ. దేన్లో అద్దుకుతిన్నా చాలా రుచిగా వుండేది.

సంక్రాంతి సమయాల్లో భోగిమంటకి పుల్లలేరుకుందుకు ఖాళీ బయళ్ళలోకి వెళ్ళేవాళ్ళం. చెప్పులు తెగిపోతే తాటిమట్టలతో చెప్పులు చేసేవాడు అన్నయ్య. నార తడపలని పట్టీలుగా చేసి అవి వేసుకుని, చాకలాళ్ళ గూనల దగ్గరుండే పలవల్ని దొంగతనంగా పట్టుకొచ్చేవాడన్నయ్య. వాటి సాయంతో పుల్లల్ని పోగుచెయ్యడం చాలా తేలిగ్గా వుండేది. ఓసారి పలవల్ని దొంగిలిస్తూండగా ఒకడు వెంటపడ్డాడు. పరిగెట్టి పరిగెట్టి కుందిరి కింద దాక్కుందామని చూస్తే, అక్కడ విశ్రాంతి తీసుకుంటున్న ఓ కుక్క గభాలున మా మీదకి దుమికింది. చేతిలో ఉన్న పలవతో దాన్ని చితక్కొట్టి నన్ను చంకనేసుకుని మా వీధి దాకా ఒకటే పరుగు పెట్టేదన్నయ్య.

ఎండాకాలం శెలవుల్లో అయితే గుట్టలెక్కి కిందనున్న గుమ్ములోకి దూకి ఈతకొట్టడం నేర్పేవాడన్నయ్య. అసలు అన్నయ్యతో గడిపితే, 'ప్రకృతీ మనమూ వేరు కాదు. ఒకటే' అనిపించేది. ఆ ఆనందం, ఆ హాయి వర్ణనాతీతం. వెన్నెల రాత్రిళ్ళలో ఆరుబయల్లో పడుకుంటే, ఆకాశంలోని పాలపుంత పరవశంగా కాంతుల పరవళ్ళు తొక్కుతున్నట్లు వుండేది. చుట్టుపక్కల ఉన్న చెట్లు రెమ్మల విసనకర్రలతో గాలివీస్తూ మాకు రాచమర్యాదలు చేస్తున్నట్లే వుండేది. ప్చ్...ఆ స్వచ్ఛమైన గాలీ, నీరూ నేదేవి?

ఏసీ గదుల్లోంచి బయటకొస్తే, ఫ్రిజ్‌లోంచి బయట పెట్టిన కూరగాయల్లాగా మనమూ వడలిపోవలసిందే.

"సార్ మీల్స్" అని బోయ్ చెప్పడంతో ఆలోచనలకి బ్రేక్‌పెట్టి లేచాను. అప్పటికే పదిన్నర అవడంతో లైట్‌గా టిఫిన్ కానిచ్చి నా సీట్లోకొచ్చి కూర్చున్నాను. నా ఆలోచనలు మళ్ళీ దాడి చేసాయి. తాతగారి ఆస్తీ, అమ్మా పిన్నిలతో సమానంగా వాటా పొందాడన్నయ్య. నేను టెన్త్‌లో ఉండగా అన్నయ్యకి పెళ్ళైంది. వదిన కూడా నన్ను బాగా చూసుకునేది. వాడికి ఒక్కడే కొడుకు. పేరు వాసు. హైదరాబాదులో ఏదో కంపెనీకి మేనేజర్‌గా ఉంటున్నాడు. పెళ్ళైంది. ఆమె ఒక ఇంజినీరు. ఇద్దరు మగపిల్లలు. పదీ, పన్నెండు సంవత్సరాలుంటాయి.

అన్నా వదినా పెద్దవాళ్ళైపోడంతో, పల్లెటూర్లో ఉండడం కష్టమై, కొడుకు దగ్గరకెళ్ళి ఓ నెలరోజులుండి వస్తామన్నవాళ్ళు పదిరోజుల్లో తిరిగొచ్చేసేరు. వాళ్ళు వచ్చేరని తెలియగానే వెళ్ళి కలిశాను.

"వచ్చావా చినబాబూ" అంటూ ఆప్యాయంగా కౌగలించుకున్నాడన్నయ్య. ఆ పై అదీ ఇదీ మాట్లాడుతూ "జీవితంలో నరుడికి నాలుగవస్థలున్నాయంటారు. అందులో బాల్య, కౌమార, యౌవనావస్థలున్నాయి చూశావూ, వాటి శిగదరగ, గడిచిపోయేదాకా ఒంటిమీద స్పృహే వుండదు ఎవరికీ. కానీ వృద్ధావస్థ వచ్చినట్లు ఇట్టే తెలిసిపోతుందిరా. అదేకదా ఆఖరి ఘట్టం. అక్కడ ఏ ఇబ్బందులూ పడకుండా హాయిగా గడవడం ఎంతో అదృష్టం" అన్నాడు సాలోచనగా.

వాడు, బయటకెళ్ళినప్పుడు "ఏమైంది వదినా?" అని అడిగాను మా వదిన్ని.

"ఏముందీ..కొడుకు దగ్గర నాల్రోజులుంటే వేదాంతం పుట్టుకొస్తోంది మీ అన్నయ్యకి. వాళ్ళంతా పొద్దున్నే ఏడూ, ఎనిమిదయ్యేటప్పటికల్లా ఇల్లువదిలి వెళ్ళిపోతారు. పిల్లలు తొందరగానే వచ్చినా, అబ్బాయీ కోడలూ ఆరైతేనేగానీ ఇల్లు చేరరు. మన వంటలు వాళ్ళకి నచ్చవు. వాళ్ళ వంటలు ఒకేరకంగా వుండి మాకు సంతృప్తిగా వుండేది కాదు. యాంత్రికంగా గడిచిపోయే జీవనవిధానం వారిది.


మన వ్యవస్థలో, ఆడది వంటింటినీ, మొగుణ్ణీ, పిల్లల్నీ కనిపెట్టుకునే మనిషి అవడం వల్ల, విధి వక్రించినా, అవసరపడితే నలుగురికి వండి పెట్టి తానూ తినగలదు. మగవాడి విషయం అలా కాదే. మగవాడు డబ్బు సంపాదించడమూ, పై పనులు చెయ్యడం వరకూ మాత్రమే గిరిగీసుకోవడంవల్లా, వంటింట్లో ఓనమాలు కూడా తెలియకపోవడంవల్లా, ఎంత డబ్బువున్నా, విధి వక్రిస్తే, ఎవరైనా ఆదరంగా ఇంత ముద్ద పెట్టకపోతే, వృద్ధాప్యం నరకమేనయ్యా. పైగా మా కాలంలో ఆడపిల్లని కొంచెం తక్కువగా చూడడంవల్లా, అణకువగా వుండాలని పెద్దవాళ్ళు పదే పదే చెప్పడంవల్లా మాకు చిన్నప్పటినుంచీ సర్దుకుపోయే గుణమూ, ఓర్పూ అలవడ్డాయని అనుకుంటున్నాను. మగవాళ్ళని, తలకి కొరివి పెట్టేవాడన్న అభిమానం చూపించడం వల్లనైతేనేమి, ఇంటిపేరు నిలబెడుతున్నాడన్న మమకారంతోనైతేనేమి, మహారాజుల్లాగా పెంచడంవల్ల వారిలో ఒకరకమైన అహాన్ని మేమే పెంచిపోషిస్తున్నామేమో అనిపిస్తోంది.

అక్కడ నాలుగురోజులుండడం వల్ల ఖర్మకాలి నాకేదేనా అయితే, మీ అన్నయ్య ఒంటరి అయితే ఎలాగా? ఎన్ని బాధలు పడవలసి వస్తుందోనన్న ఆలోచన నన్ను తినేస్తోందయ్యా" అంది కళ్ళు తుడుచుకుంటూ వదిన.

ఆవిడ భయపడ్డట్టుగానే మరో రెండేళ్ళలో హార్ట్ ఎటాక్ వచ్చిపోయిందావిడ. వాసు వచ్చి, పొలాలన్నీ అమ్మేసి వచ్చిన సొమ్ములో, హైదరాబాదులో ఒక ట్రిబుల్ బెడ్ రూం ఫ్లాట్ కొనుక్కున్నాక, అన్నయ్యని తీసికెళ్ళాడు. వెళ్ళి నాలుగు నెలలైందేమో..ఇదిగో ఇలాగొచ్చింది ఫోను"

కడుపులో కాస్త టిఫిన్ పడిందేమో, కళ్ళు కూరుకుపోసాగేయి.

మర్నాడు ఏడున్నరకి హైదరాబాదు చేరుకున్నాను.



'ఇంకా ఎన్నిసార్లు రావలసి వుంటుందో తెలియదు. ఆటోమీద వెడితే చాలా డబ్బు ఖర్చు అవుతుందని ఆలోచించుకుని రెండుబస్సులు మారి వెళ్ళేప్పటికి తొమ్మిదైంది. అంతా వెళ్ళిపోయినట్లున్నారు. తలుపులు వేసి వున్నాయి. కాలింగ్ బెల్ నొక్కాను.

"ఎవరూ?" అన్న అన్నయ్య గొంతు పీలగా విన్పించింది.

"నేనే అన్నయ్యా శంకరాన్ని. తలుపుతియ్యి" కొద్దిగా తెరచివున్న కిటికీ తోస్తూ అన్నాను గొంతు బొంగురుపోతూండగా.

"ఆ..శంకరమే..ఏదీ ఇటు రామ్మా" అంటూ కిటికీ బాగా తీసి నన్ను చూశాక తలుపుతీసాడు అన్నయ్య. తలుపు తీసీ తియ్యంగానే గట్టిగా వాటేసుకుంటూ "ఏమిట్రా అన్నయ్యా ఇలాగైపోయావూ" అన్నాను.

నిండుగా ఎస్వీరంగారావులాగా ఉండేవాడు. రమణారెడ్డిలాగా సన్నగా అయిపోయేడు.

"సర్లే. ఇంకా బ్రతికున్నందుకు సంతోషించు. ఏదీ..నా కోసం ఏం తెచ్చావు?" అంటూ చిన్నపిల్లాడిలా నా బేగ్‌లోని సామాన్లు తలక్రిందులు చేసేసి "అమ్మో! చాలానే తెచ్చావే. కందిసున్నీ, అప్పడాల పిండీ..ఊరుపిండి వడియాలూ..ఎన్నాళ్ళైందిరా వీటిని తిని. కొబ్బరుండలూ, జీళ్ళూ, నిమ్మతొనలూ కూడా తెచ్చావే. నా ఇష్టాలు నీకెంత గుర్తురా చిన్నా" అని "నువ్వు, రాత్రెప్పుడు తిన్నావోయేంటో! హోటల్‌కెళ్ళి రెండు భోజనాలు పట్టుకురారా..వీళ్ళు పగలు అవీ ఇవీ తిని రాత్రిళ్ళు మాత్రమే తింటారు అన్నాలు. పోనీ వండుకుని తిందామన్నా, చేతనై ఛస్తేనా? ఓసారి కుక్కర్ పెట్టేను. అదేంటో బాంబులాగా పేలి ఇంటికప్పు కెళ్ళికొట్టుకుని కిందపడింది. నా అజాగ్రత్తవల్ల అగ్నిప్రమాదాలేమైనా అవుతాయని వంటింటికి తాళం పెట్టుకుంటున్నారు. ఏవిటో మీ వదిన రెండు పూట్లా అన్నమే వండి పెట్టినా బాగానే ఉండేదా..! ఇక్కడకొచ్చీ రాంగానే ఒకటే విరోచనాలు..ఇక ఇప్పుడు పొద్దుట కాఫీతో రెండు బ్రెడ్డుముక్కలు తిన్నాను. ఒంటికి మంచిదిట. మూడు రొట్టెలు చేసి పెట్టింది కోడలు" కలగాపులగంగా అన్నయ్య చెప్తున్న మాటల్లో, వాడు పడుతున్న అవస్థలు స్పష్టంగా కనిపించడంతో, కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. గభాలున స్నానం చేసి రెండు మీల్స్ తెచ్చాను.

వాటితోపాటు నేను తెచ్చినవి కూడా వేసుకుని, అవురావురుమని తింటున్న అన్నయ్యని చూస్తుంటే మా వదిన అన్నమాటలు గుర్తుకు వచ్చి హృదయం కలుక్కుమంది.

చెయ్యి కడుక్కుంటూ "వాళ్ళ ముందు అడిగితే బాగోదుకానీ ఒక రెండొందలిచ్చిపోరా చిన్నా! రోజూ సాయంత్రం ఏదైనా తిందామనిపిస్తోంది" అన్నాడు అన్నయ్య.

వెంటనే అయిదువందల నోటు తీసి ఇవ్వబోతూ, మళ్ళీ చిల్లర కావలసి వస్తే ఇబ్బందిపడతాడని, రెండు వందనోట్లూ, నాలుగు ఏభైలూ, పదులు పది ఇచ్చాను. అన్నయ్య ముఖంలో నిబ్బరం కొట్టొచ్చినట్లు కనబడింది. ఓ పోలిథీన్ కవర్‌లో డబ్బు పెట్టుకుని 'ఎక్కడ దాచాలా?' అన్నట్లు నడుముకి చేతులు కట్టుకుని ఇల్లంతా కలయచూశాడు. డైలీ కవర్లో దాచుకున్న రామాయణ, భారతాల్లో పెట్టుకున్నాడు.



పిల్లలు నాలుగ్గంటలకొచ్చి వంటింటి తాళాలు తీసుకొని ఏవేవో తిని, పాలు తాగి ఆడుకుందుకి వెళ్ళిపోయారు.

ఏడౌతూండగా, వాసూ, సుష్మా వచ్చారు.

"ఎప్పుడొచ్చావు బాబాయ్. ఏమిటిలాగ? ఒక ఫోన్ చేస్తే బాగుండేది" అన్నాడు వాసు.

"సడన్‌గా చూద్దామనిపించింది వచ్చేశాను" అంటూండగా, సుష్మా గది వాతావరణం చూస్తూ "ఇవేమిటి? హోటల్ నుంచి మీల్సేవన్నా తెచ్చారా? ఏమిటి మావగారూ ఇది? ఆయన హెల్త్ గురించి మేమెంత వర్రీ అవుతున్నామో మీకేం తెలుసు? పేద్ద అభిమానమున్నట్లు ఈ అడ్డమైన గడ్డీ తెచ్చారు. మళ్ళీ హెల్త్ పాడైతే ఎవరండీ బాధ్యులు" చేగోడీల సంచీ దూరంగా గిరాటేస్తూ అంది సుష్మ.

"మా ఆవిడకి అంతా పద్ధతిగా ఉండాలి బాబాయ్. తేడా వస్తే భరించలేదు" అన్నాడు వాసు.

అన్నయ్యేమీ మాట్లాడలేదు. నేను మాట్లాడదల్చుకోలేదు. పేపర్ అందుకున్నాను. వాళ్ళిద్దరూ లోపలికెళ్ళిపోయారు.

రాత్రి భోజనాలైనాయనిపించి, నిద్ర వస్తోందని చెప్పి లైటు ఆర్పేసి పడుకున్నాను. మనసుకైన గాయానికి హృదయం మూలుగుతోంది.

ఓ రాత్రివేళ, నిద్రకి దూరమైన నన్ను తట్టిలేపి "నన్ను నీతో తీసుకుపోరా చిన్నా" అన్నాడు అన్నయ్య.

గుండె చెరువౌతున్నా, వసంత మాటలు గుర్తుకువచ్చి ఏమీ మట్లాడలేదు నేను. ఏవేవో చిన్ననాటి ముచ్చట్లు మొదలుపెట్టేడన్నయ్య. సడెన్‌గా లైటు వెలిగింది. వాసూ, సుష్మా గబగబా లోనికి వచ్చారు.

"పగలంతా హాయిగా పడుకున్నట్లున్నారు. తీరిగ్గా టీవీ పెట్టినట్లు ముచ్చట్లాడుకుంటున్నారు. ఇలాగ డిస్టర్బ్ అయి కంటినిండా నిద్రపోకపోతే ఆఫీసులకేం పోతాం? ఉద్యోగాలేం చేసుకుంటాం?" ముఖం అప్రసన్నంగా పెట్టుకుని విసుక్కుంది వసంత. వాసు ఏమీ మాట్లాడకపోయినా, ఆమెకి సపోర్టింగానే వచ్చేదని అర్థం అవుతోంది.

అన్నయ్య లేచి బాత్‌రూం కెళ్ళాడు.

## ఎందుకో అలా...

ఈమధ్య దుబాయ్‌లో 'మై ఔర్ మిసెస్ ఖన్నా' సినిమా షూటింగ్ సందర్భంగా విశ్రాంతి కోసం మేకప్ చేసుకునేందుకు ఔట్‌డోర్‌లో ఉపయోగించే వాన్‌ని తీసుకురాలేకపోయారట యూనిట్‌వాళ్లు. దీంతో హీరోయిన్ కరీనాకపూర్ ఎలాంటి చిందులు తొక్కుతుందో అసలు షూటింగ్ జరుగుతుందో లేదోనని బిక్కుబిక్కుమంటుంటే కరీనా మాత్రం ఆ విషయం పట్టించుకోకుండా 12 గంటల ఆ షిఫ్ట్ వర్క్‌ని పది గంటల్లోనే పూర్తిచేసి పారేసిందిట. ఇది నిరసనగా అంత జోరుగా షూటింగ్ ముగించిందా లేక మంచితనంతో కోపరేట్ చేసిందా? అని ఆలోచించిన నిర్మాతలు ఏదైతేనేం తమకి మాత్రం మంచే జరిగిందని సంబరపడ్డారట.




"చూశారా! చూశారా. హోటల్ భోజనం తేడా చేసిందో ఏమిటో. ఇంక మళ్ళీ మనకి అవస్థలు" అంది సుష్మ అక్కసుగా.

నేను రావడం, అన్నయ్యకి కావలసినవి చూడడం ఆమెకి ఇష్టం లేదేమో అనిపిస్తోంది.

"చూడమ్మా. ఎప్పుడైనా రెండుసార్లు అవతలకి వెళ్ళ వలసి వస్తే, అదేమీ పెద్ద జబ్బు కాదమ్మా. మా అన్నయ్య ఎలాగ బ్రతికేడో నీకు తెలియదు. పులి. పెద్దపులిలాగా బ్రతికాడు. బతికినన్నాళ్ళు బ్రతకడు. కనీసం కడుపు నిండా తిండి పెట్టకపోతే ఎలాగమ్మా. వృద్ధాప్యం ఒక శాపం కాకూడదమ్మా ఎవరికీ.." అన్నాను.

"మరీ అంత ప్రేమ కారిపోతుంటే, మీతోపాటే తీసి కెళ్ళి చేయించండి సేవలు" అంది సుష్మ.

అనుకోని ఈ ఎత్తిపొడుపుకి ఒక్కక్షణం ఖంగుతిన్నా, సద్దుకుని "తప్పకుండా. వాడి ఆస్తిలో సగం వాటా వాడికిచ్చేయండి. అంత ఆస్తిగలవాడు, దయనీయంగా మా పంచన పడివుండడం నాకిష్టంలేదు" అన్నాను.

"బాబాయ్" విస్తుపోయాడు వాసు.

"అయితే పెద్దప్లానుతోటే వచ్చినట్లున్నారు. చిన్నత్త య్యగారు చూస్తారనే?"

"చూడదు. చూడనని చెప్పేసింది కూడా. నా చిన్న తనంలో వాడు నాకు పంచిన ప్రేమకి, ఇలాగైనా ఋణం తీర్చుకుంటాను. కుదరకపోతే ఓల్డేజ్ హోంలోనైనా పెట్టి, రోజూ వెళ్ళి చూసి వస్తూం టాను"

"అప్పుడుగానీ మా పరువు పూర్తిగా పోదు" అంది సుష్మ.

"అయినవాళ్ళమధ్య ఇలాగ నరకం అనుభ వించేకన్నా, తమ వయసుగల నలుగురి మధ్య హాయిగా గడుపుతాడు. తప్పులేదు" అంటూ "వాసూ పెద్దవాళ్ళని గౌరవం గానూ, ఆదరంగానూ చూడడ మంటే ఏమిటనుకుంటున్నావు? మనని మనం గౌరవించుకోవ డమే. మన వృద్ధాప్యానికి మనమూ మంచి ఎరేంజిమెంట్లు చేసుకున్నట్లే. ఎందుకంటే మన చేష్టలని పిల్లలు గమనిస్తూ నేర్చు కుంటారు..." అంటూంటే నన్నో సారి ఎగాదిగా చూసి గబగబా లోనికి నడిచింది సుష్మ. వాసు మౌనంగా ఆమెని అనుసరిం చాడు. బాత్‌రూం నుంచి ఎప్పు డొచ్చాడోగానీ మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడన్నయ్య.

వాసు మౌనం నాకెంతో బాధ కలిగించింది. చాలాసేపటి కి గానీ నిద్రపట్టలేదు.



* * *

"నాన్నా నాన్నా. లేవండి. కాఫీ కలిపాను. బ్రష్ చేసు కోండి" అన్న వాసు గొంతు విని ఆశ్చర్యంగా కళ్ళు విప్పాను.

"ఏంట్రా... ఇవాళ శెలవా?" ఆనందాశ్చర్యాలతో అన్నాడు అన్నయ్య.

"ఓ గంట ఆలస్యంగా వస్తానని మెసేజి కొట్టాను"

"అలాగా" అంటూ లేచాడన్నయ్య.

వాసు నా మంచం మీద జాగా చేసుకుని కూర్చుంటూ "ఏమిటో, పురుషాహంకారంతో, ఇంటి పనులు సుష్మాయే చేసుకుంటుందిలే, నాకెందుకు? అను కుని ఆయన బాధలు పడుతున్నా, నేను కల్పించుకుని సలహాలిస్తే ఆమెని నొప్పించినవాణ్ణవుతానని చూసీ చూడనట్లుగా ఉండిపోయానిన్నాళ్ళూ. రాత్రి చాలాసేపు ఆలోచించాను. ఆయన నన్నూ ఎంతో ముద్దుగా పెంచారు. నువ్వు చెప్పిన అవకాశాలు నాకూ ఉన్నా యిగా. ఆయన ప్రశాంతంగా నా దగ్గరే గడపాలి. గడు పుతారు కూడా. నన్ను నమ్ము" అని వాసు అంటూ వుంటే ఎంతో ఆనందంగా అనిపించింది.

ఎప్పుడు లేచారో పిల్లలు గుమ్మం దగ్గర నిల్చుని చూస్తున్నారు.

"రండిరా! ఇలా రండి. మీ చిన్నతాత బోలెడు చిరు తిళ్ళు తెచ్చాడు" అని అన్నయ్య అంటూంటే సంశ యంగా చూస్తున్న వాళ్ళని "రండి నాన్నా రండి లోప లికి" అని వాసు అనంగానే ఇద్దరూ లోపలికొచ్చేరు. అన్నయ్య తడుముకుంటూంటే పెద్దాడు బ్రష్‌మీద పేస్టు వేసి అందించాడు.

చిన్నవాడు చెదిరిన దుప్పటి దులిపి సరిచేసాడు.

"నువ్వు చెప్పింది చాలా కరెక్టు బాబాయ్. వీళ్ళు ఈయన గదిలోకి రావడం ఇదే ఫస్ట్‌టైం ఏమో..." అన్నాడు వాసు.

"నిన్నటి పరిస్థితి చూసి, ఇవాళ అన్నయ్యని వదిలి ఎలా వెళ్ళాలా అని మథనపడుతున్నాను. ఇప్పుడు నాకెంతో రిలీఫ్‌గా వుంది" అన్నాను వాడిని దగ్గ రకు తీసుకుంటూ.

"అప్పుడే మీ బాధ్యత అయిపోయిందనుకో కండి. ప్రతినెలా వచ్చి చెకింగు చేయాల్సిందే. ఈయనెవరు నమ్మేరు" అంటూ వచ్చింది సుష్మ.

"అక్కర్లేదమ్మా. మీ అందర్నీ వీడి చుట్టూ చూస్తూంటే మా అన్నయ్యకి నా దిష్టే కొట్టే ట్టుంది" అంటూంటే గలగలా నవ్వేసేరం దరూ.

☆

## వాయిదాపడిన పెళ్ళి!

నిన్నటి కాంప్లాన్ గాళ్ నేటి బాలీవుడ్ ముద్దుగుమ్మ ఆయేషా టకియా పెళ్ళి ఈ ఏడాది ఆరంభంలో జరగాల్సి వుంది. కానీ తనకి కాబోయే అత్త గారు మాత్రం ఆయేషాని తన కోడలిగా స్వీకరించేందుకు అంత సుముఖంగా లేకపోవడంతో ప్రస్తుతానికి పెళ్ళి వాయిదా పడిందని చెబుతున్నారు బాలీవుడ్ జనాలు. ప్రియుడు ఫర్హాన్ అజ్మీని ఇష్టపడి మనువాడాలనుకున్న ఆయేషా ఇప్పుడు కాబోయే అత్తగార్ని కన్విన్స్ చేసే ప్రయత్నంలో పడిందిట.